


# ఆకలి పోరాటం

అయ్యగారి శ్రీనివాసరావు

"నువ్వు చెప్పుకోవలసిందే మైనావుందా?" వాదనలన్నీ పూర్తయిన తర్వాత తన తీర్పు ఇచ్చే ముందు బోనులో నిలబడ్డ కృష్ణవేణి వైపు తిరిగి ప్రశ్నించాడు జడ్జీ.

కోర్టు హాలంతా నిశ్శబ్దంగా ఉంది ఆమె ఏమి చెబుతుందో వినడాని కన్నట్టు. కాని రెండు మూడు నిముషాలైనా ఆమె మౌనం విడిచి పెట్టకుండా కనీసం తలెత్తకుండా ఉండడంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అన్నాడు.

"యువరానర్ ! ముద్దాయి స్వయంగా నేరం ఒప్పుకుని పోలీసులకి లొంగిపోయిన తర్వాత, అదీ కాక ఏ ప్రశ్నకీ మౌనమే సమాధానమైన తర్వాత ఇంకా ఆమె చెప్పుకునే దేదీలేదని నా అభిప్రాయం. కాబట్టి ఈ ముద్దాయి నేరానికి తగిన శిక్ష విధించవలసిందిగా కోర్టు వారిని కోరుతున్నాను" అన్నాడు వినయంగా.

